# తీర్చిన బాకీ

అప్పుడే సైకీలుకు చీటి తీసుకొని, హోటలులో ప్రవేశించాను, జేబు రుమాలతో ముఖం తుడుచుకుంటూ. ఎలెక్షన్లరోజులో రాజకీయసభలాగ జనం కిటకిట లాడిపోతున్నారు ఆ పెద్దహాలంతా. ప్రక్కగదిలోకి వెళ్ళాను, అక్కడ మాత్రం ఖాళీవుంటుందా అనే సందేహం వున్నప్పటికి. అనుకున్నంతపని జరగటంవలన తప్పనిసరిగా నుంచోవలసి వచ్చింది. ఆఫీసులో కూర్చుని కూర్చుని వంచినతల యెత్తకుండా వ్రాసివచ్చిన యీ ఘటానికి యీ నుంచొనటం కూడ కొంచెం హాయే అనిపించింది. కుర్చీవుంటే కూర్చునేవాణ్ణె అది తర్వాత విషయం. ఎవరో వకాయన వక కుర్చీ ఖాళీ చేస్తే ప్రక్కాయన కాస్త వక జేబురుమాల దానిమీద పారేశాడు. స్నేహితుల కోసం కుర్చీలను రిజర్వు చేసేవాళ్ళను చూస్తే నాకు సహజంగా వళ్ళు మంట. ఎవరు ముందరవస్తే వాళ్ళు కూర్చోవటంగాని, యీ రిజర్వేషన్ సిస్టమేమిటి కమ్యూనల్ జి. వోలాగ అని. ఏదో ఆలోచిస్తూ నుంచున్నా. ఊరికే నుంచున్నా అంటే ఏమంత బాగుంది? నా దృష్టులు అనుకోకుండా ఆ చివర కుర్చీమీద ప్రసరించినాయి. ఇందాకటినుంచి వృధాగా నుంచున్నానే. పోనీ ఆ కుర్చీఖాళీగా వుందిగదా, సహాధ్యాయిగదా నన్ను పిలవరాదు యెవరైనా అనుకున్నా. ఆ మాత్రం సహకారం మన ఆంధ్రులలో మొదటినుంచి లేదు. ఇవ్వాళ రమ్మంటే యెక్కడనుంచి వస్తుందీ అని సమాధానపరచుకుని, కొంచెం గబగబ వెళ్ళి ఆ కుర్చీలో కూలపడ్డా.

నావంక ప్రక్కవాళ్ళిద్దరు వురిమిచూసి నట్లనించింది. వకాయన నావైపుకు కొంచెం జాలిగాకూడ చూశాడు. ఆ చూపుల అంతరార్థంవాళ్లకు తెలియాలి గాని, వాళ్ళముఖాలు చూడనివాడికి నాకేమర్థమవుతుంది! **వకాయన అప్పుడే చేతులు తుడుచుకుంటూ నాదగ్గరకువచ్చి Sorry**

యిక్కడ మొదటే నేను కూర్చున్నానండి, ఇదిగో గ్లాసుకూడవుంది చూడండి
అన్నాడు సాక్ష్యంలేందే కేసు నెగ్గదనే అభిప్రాయంతో. నా సంగతి అయన
కెట్లా తెలిసిందో! కొంతమంది లోపల నవ్వుకున్నా, నేను లేచినప్పుడు
మాత్రం Excuse me అన్నాడు ఆయన. అది వోమాదిరి వుపశాంతి.

ఇంకొకమూల యిద్దరు యేవో మాట్లాడుకుంటూ, నన్ను యెట్లా
చూశారో యేమో గొడవ.ముందరే కనక నేను వాళ్ళని చూస్తేమాత్రం,
మెల్లిగా జారుకునేవాణ్ణే. 'ఏమండోయి మీ దర్శనాలు బొత్తిగాలేవు. రండి
రండి' అంటూ కొంచెం జరిగాడు వకతను కుర్చీలో సగభాగం నాకోసం
చూపిస్తూ. తన వస్తువవుతే అట్లాభాగం పంచుతాడా అనిపించింది. నా
గుండెల్లో రాయిపడింది. పిలిచినతర్వాత తప్పించుకోవటానికి ప్రయత్నము
చేసి విఫలమయ్యేదానికన్న, ఎప్పటికెయ్యేది ప్రస్తుతము అప్పటికయ్యేదే....
కనుక, వాళ్ళకే తాళంవేస్తే సరిపోతుందనుకుని 'ఎవరైనా యెరుగున్న
వాళ్ళున్నారేమో అని చూస్తున్నాను. చప్పున మీరు కనిపించారు. నేను
రాపోతుంటే, నిజానికి వెళ్ళిపోతుంటే అంటే సూటిగా వుంటుంది, మీరే
పిలిచారు. సరిపోయింది అన్నాను, లేనిపోని నవ్వుతెచ్చుకుంటూ. నా బోటి
వాడే అవతలవాడుకూడ అవుతే యీ కృత్రిమపు నవ్వును నిమిషంలో కని
పెట్టేవాడే. వాడికామాత్రం తెలివితేటలు లేవని నాకుతెలుసు. వాడేమో
వున్నాయనుకుంటాడు ఇంతేభేదం. కూర్చున్నాను. తర్వాత రావణాసురుడు
కాష్ఠంలాగ కాలుతున్న కొరియాయుద్ధందగ్గరనుంచి, దీపావళిలో తుస్సు
మన్న సీమ టపాకాయిలాగ డిపాజిట్ పోగొట్టుకున్నదాక వకసారి యెడ
తెరిపి లేకుండా Exchange of Views అయినాయి. తర్వాత కొంచెం
సేపు వుద్యోగపు గొడవల్లో దిగాము. మంచిఘట్టంలో వుంటూవుండగా, రిస్టు
వాచి, ఇస్త్రీలాల్చి, ఇస్త్రీలాగు కాళ్ళకు బూట్సుమాట అంత పరీక్షగా చూడ
లేదు కానీ, వీటినిబట్టి చూస్తేమాత్రం అవి లేకపోయినా బహుశా యెవరో
పెద్దమనిషే అని భావించాల్సి వస్తుంది. నాదగ్గరకొచ్చి నుంచున్నాడు. ఇక్క

డమో చోటులేదని తెలుసుకునికూడ, యిక్కడికే రావటంలో ఆయన అభిప్రాయము యేమైవుంటుంది అని ఆలోచించా. ఎందుకైనా మాటఅంటే ప్రమాదం ఏంలేదుగదా, డబ్బుతో పనికాదు కాబట్టి, మీరుకూడ ఎట్లాగోట్లా సర్దుకుని కూర్చొండి అంటూ ప్రక్కకుర్చీ చూపించాను. వచ్చిన పెద్దమనిషి నా అదృష్టవశాత్తు ఆ క్షణం అటువైపుకు చూస్తూ వుండటంవలన నా మాటలు ఆయన వినుపించుకున్నట్టులేదు. 'మీకేంకావాలో చెప్పండి. ఎంతసేపు మాట్లాడుకోవటం, అన్నాడు. మొదటిమాట జోరుగా రానిస్తూ, రెండోది కొంచెం వడితగ్గించి. మా స్నేహితులిద్దరు యేమున్నాయని అడగటం, ఆ పెద్దమనిషి, క్రొత్తకోడలుమీద అత్తగారు నేరాల పంచాంగము చదివినట్టు, పదార్థాలలిస్టు ఏకరువుపెట్టటం, వీళ్లేదో తెమ్మనిచెప్పటం, యీకాస్త వ్యవధిలో నా మనస్సులో చెలరేగిన తుపాను యింతా అంతాకాదు. నా రిస్టువాచికి సెకండుముల్లులేదు. చవకగా వస్తోందిగదా అని మా స్నేహితుని అవసరాన్ని డబ్బుగా మార్చినబాపతు. ఆ పెద్దమనిషి రిస్టువాచి స్విజ్‌మేడ్, సెకండుముల్లువుంది, మణికట్టుకు గొలుసుకూడాను. ఆయన తొడుక్కున్న లాల్చిగుడ్డ నేను బజార్లో బేరంచేసి అంత ధరపెట్టి కొనగలమా అనే అధైర్యంతో యింటికి తిరిగివచ్చినట్టు స్ఫురణకు వచ్చింది. ఆయన తొడుక్కున్న లాగుగుడ్డకోసం, ఎన్నిసార్లు క్యూలో నుంచున్నానో, ఆ సీనంతా కళ్ళకు కట్టినట్లుంది.

ఆయన నావంక చూస్తాడేమొ అనుకున్నా. క్రొత్త కోటు తొడుక్కున్నా. నాకు వో రకపు బూటువుంది. ఓ చిన్న జల్లెడలాంటి హేటుకూడ పెట్టుకున్నా, నేను మాత్రం సామాన్యంగా వున్నానా! కన్నెత్తైనా చూడలా నా వంక. అట్లాగే వెళ్ళిపోయాడు. ఇట్టేవచ్చి, ఏవో నాముందరపెట్టాడు తీసుకోండి అన్నారు స్నేహితులిద్దరు ఇదేమన్నాగృహమా యిక్కడకూడ మర్యాదేమిటో అనుకున్నా. అట్టే చప్పుడుకాకుండా పనిపూర్తిచేశాను. ఇక రెండోఅయిటం యేమిటా అని వాళ్ళు ఆలోచిస్తున్నారు. అప్పటికి నా పరిస్థితి వుక్కిరి బిక్కిరిగా వుందంటే అతి

శయోక్తి యేమీ లేదు. నేను యేదో లఘువుగా టిఫన్ పుచ్చుకుని డబ్బునుబట్టి కాఫీయా,టీయాఅనినిర్ణయించుకుందామనే వుద్దేశంతోబయలుదేరుతే. వీళ్ళిద్దరు నాకుదాపరించారు. ఆనాడు ధర్మరాజును పరీక్ష చెయ్యటానికి యమధర్మరాజు కుక్కయి వచ్చినట్టు వాళ్ళు చెపుతున్నకొద్దీ అణాల మీద అణాలు ఎక్క పోతున్నాయి. వాళ్ళిస్తారు డబ్బు అనే నిర్ణయానికి వద్దామా, నా హోదాకు యేమాత్రం సరిపోదు పైగా లోటు. పోనీ నేనిద్దామా అనుకుంటే, ఏమిటి యిచ్చేది అనేదేగా ప్రశ్న. ఇది తీసుకుందామా అంటూ యేదో పేరు చెప్పారు. ఆ పేరు నేను అదే మొదటిసారి వినటం. నాకు తెలియని పదార్థాలు ధర యెక్కువ వుంటాయని గట్టి నమ్మకం నాకు. చవక బారవుతే యెప్పుడో అప్పుడు నాకు తగిలేవేగా! వద్దన్నామా కొంపతీసి చటుక్కున, డబ్బు నువ్వేమీ యివ్వక్కర్లేదులే అంటారేమో! (ప్రెస్టేజి కోసమన్నా, డబ్బు లెక్కేమిటి నేను యిస్తాన్లే అనాలిగా? ఆమాట ఆసరా చూసుకుని వాళ్ళు పేటుమీద ప్లేటు యెక్కించారంటే యింకా వేరే చెప్పనక్కర్లేదు. ఈ సమయంలో మనకు అగ్ని పరీక్షలాంటిది వకటి కల్పించారనుకుని, యేదో వకటి చెప్పండి దానికి ఆలోచన యెందుకు అని అలాంటి భారమైన విషయాన్ని అతితేలికగా అనేసి యింకొక టాపిక్ లోకి దిగాము.

అప్పుడే వకచేతిలో పళ్లెము, యింకొక చేతిలో నల్లటిగుడ్డ, మాస్టరు గారిచేతిలో డస్టరులాగ పట్టుకుని వస్తున్నాడు మా వైపుకు. ఈ హంగామా అంతాచూసి, టేబుల్ తుడవటానికి వస్తున్న బాపతుగదా అనుకున్నాగాని, లేకపోతే ఆయనకు కూడ వక కుర్చీ చూపించేవాణ్ణేమో కూడా కూర్చోటానికి. ఆయన వచ్చి నా వైపు బల్ల తుడుస్తుంటే నా ప్రాణాల్లో ప్రాణాలులేవు, ఆ కోటు మీద ఏం వేస్తాడో అని. కొంచెం జరిగామా, యెవరో దాక అక్కర్లా, వాడే నవ్వుతాడు, ఏ పల్లెటూరు నుంచి వచ్చాడో అని. చెప్పకండా వూరుకుందామా వాడు అంత పని చెయ్యందే కదిలేటట్టు లేదు. ఆ తుడిచే సమయంలో వాడి అరచేతిలోవున్న పళ్ళెం సూటిగా నా తలకాయ మీద

వుందంటే నమ్మండి. గరిమనాభి సూత్రం యెక్కడ అప్లయ్ అవుతుందోఅనే భయం నాకు యింతా అంతా కాదు. ఇక చాల్లే అని అందామనుకుంటున్నాను, వాడి పుణ్యమా అంటూ, కొంచెం నీళ్ళు నా బూటు మీద పోసినా అట్టే గోలచెయ్యకుండానే పోయాడు.

తటాలున నాకు పెద్ద నవ్వొచ్చింది మా ప్రక్కన కూర్చున్న వాళ్ళను వోకంట చూస్తూ వుండటంవలన, నాలో నేను నవ్వుకుంటే ఏం లాభం. అక్కడ హాస్యం యేమిటంటే, వకాయన మూడు ప్లేట్ల యిడ్లీ సుష్టుగా కొట్టేసి తర్వాత తెలిసింది అయనకు బ్రాహ్మణార్థాలు చెయ్యటం అలవాటుందని, అలవాటేమిటి అయన వృత్తి అది. చెయ్యి కడుక్కోటానికి పంపు దగ్గరకు వెళ్ళాడు కాఫీకి అర్డరు యిచ్చి. ఈలోపుగా యెదురుగుండా కూర్చున్నాయన వకగుక్కెడు కాఫీ త్రాగి, కాఫీకప్పులో చీమపడిందని, కాఫీ కప్పులో చీమపడక, చిరుతవులి పడుతుందా! అతి విసుగ్గా ఆ కప్పును అవతలకు త్రోసి, గబ గబ అవతల పంపుదగ్గరకు వెళ్ళాడు. ఈలోపుగా మొదట వెళ్ళినాయన చెయ్యి కడుక్కొని వచ్చి కూర్చున్నాడు తన సీట్లో; ఎం. ఎల్. ఏ. అసెంబ్లీహాలులో కూర్చున్నట్టు. తనకేం తెలుసు జరిగిన విషయం. చూస్తే కప్పులో కాఫీ కొంచెం తక్కువగా వుంది. ఏమోలే కొంచెం తక్కువ పడ్డాయేమొ పాలుపొయ్యటంలో, ఈ భాగ్యానికి అడిగేదేమిటిలే అని త్రాగుతున్నాడు. ఇందాక పంపుదగ్గరకు వెళ్ళినాయన కాస్తవచ్చి, 'అయ్యో! పంతులుగారు మీరు త్రాగేశారా' అన్నాడు. గభాలున వులిక్కపడ్డాడు ఏం త్రాగుతే అంటూ 'అ....ఏం లేదు ఏదో చీమో, యీగో కాఫీలో వుంటే కొంచెం త్రాగి బాగా లేదని వదిలేశాలెండి' అన్నాడు అతి నిబ్బరంగా. అంత ఆక్షేపణీయమైన విషయమున్నూ.అవుతే నా ముందర యెందుకు పెట్టారు అని గద్దించాడు.

**Sorry** దాంతో సరి.

మొత్తం మీద పట్టుపట్టిన తర్వాత వదిలేస్తారా యధాశక్తి పూర్తిచేసు కుని బైటపడ్డాము. బిల్లు యెంత అయిందో దాని ముఖం కూడ చూడలా. ఇక తప్పించుకొవాలసిన నమయము వస్తోందన్న మాట. నేను పంపుదగ్గరకు వెళ్ళిపోతున్నా. నా స్నేహితుడు 'బిల్లు నేను తీసుకువస్తాన్లే' అన్నాడు. ఆ మాటల్లో నాబోటి వాడికి డబ్బు నువ్వు యివ్వాలనే అంతరార్థం ధ్వనించింది. వీపు చరిచినట్లయింది. మా స్నేహితులిద్దరు ఎంతో ధీ మా గా ముందుకు నడుస్తున్నారు, డబ్బు ఇవ్వనివాడు బోటు ముందెక్కినట్టు. ఇంత వరకు రానిచ్చాం గదా బిల్లు అని సంతోషమో ఏమో మరి. వాళ్ళిద్దరు బిల్లు టేబుల్ మీదపెట్టి ముందుకు నడుస్తున్నారు, ఆయన సిగరెట్టు త్రాగడులేరెండే తీసుకో అంటూ.

నా దగ్గర డబ్బులేదని చెపుదామా, నా దగ్గరే లేకపోతే వాళ్ళిద్దరి దగ్గర యే ముంటుంది? ఉండకపోతే అంత ధీమాగా ప్లేటుమీద ప్లేటు యెందుకు ఆర్డరు యిస్తారు. నే నన్నా మొదటే వక కాఫీ చాలన్నా సరి పోయేదే. ఈ విషయాలన్ని యింట్లో అవుతే సావకాశంగా చర్చించటానికి టైముంటుంది. బిల్లేమొ వకమూల టేబుల్ మీద వుంది. కౌంటర్‌లో పెద్ద మనిషి చెయ్యిజాపు తున్నాడు. ఈ క్యూసిస్టమ్ ప్రకారము మా బిల్లుయిస్తేనే కాని, మా వెనకవాళ్ళు యివ్వటానికి వీలుండదు.

నేను తొడుక్కుంది కోటు కాబట్టి, నాలుగు జేబుల్లో సవిరించి వక నిర్ణయానికి వచ్చాను. నా మనిపర్సు యెవరో కొట్టేశారు అంటూ గభాలున వెనక్కు తిరిగాను. మొదట మేము కూర్చున్న చోటుకు వెళ్ళి వెతికాను. నలుగురు పోగయ్యారు. ఎక్కడ పోయిందని వకాయన, అది తెలిస్తే వెతుక్కోవటం యెందుకో! అసలుపోయిన మాట అబద్ధం అనే వి ష యం తర్వాత సంగతి. హొటల్లోకి వచ్చాక మనిపర్సు చూసుకున్నారా అని వకాయన. మనీపర్సులేదు కాబట్టి నేడు చూసుకో లేదనుకోండి. ఉన్నవాడవుతే మాత్రం హొటల్లోకి రాంగానే చూసుకుంటాడా! ఇక్కడవుతే క్రిందపడ

లేదంటూ వకాయన. బహుశా దార్లోనే యెక్కడో పోయివుంటుందని వకా యన, ఇలాంటి అసందర్భపు ప్రశ్నావళితో నన్ను ముంచేశారు. ఎంత డబ్బు వుందని వకాయన అడిగేటప్పటికి నాకు అరికాలు మంట నెత్తికెక్కింది. పోయిన తర్వాత యెంత డబ్బవుతే తనకేమొ? ఎంతవుతే ఏంలెండి పోయినది తిరిగి వస్తుందా' అన్నాను. అంత వేదాంతం తెలిసినా వెతుక్కోవటం యెందుకో అని వకాయన యథాశక్తి వాకుృచ్చారు.

ఈ గలాభా అంతా చూసి మా స్నేహితులిద్దరు యెక్కడ పోయిం దేమిటి అంటూ వచ్చారు సిగరెట్టు పొగవిడుస్తూ. కౌంటర్‌లో కూర్చున్న అయన నా పర్సు పోయిందని అదుర్దాకంటె, బిల్లు యెట్లాగా రాబట్టుకోవటం అనే అదుర్దాలో వున్నట్లు కనిపించింది. దానినిబట్టి మనవాళ్లు బిల్లు సామాన్యంగా చెయ్యలేదని స్పష్టమవుతోంది.

పోన్లే ఎంత గాభరాపడినా గౌరవంగానే తప్పించుకున్నాలే అనుకున్నా. ఇంతలోకి అప్పుడే యేం కొంప మునిగిపోయిందనో ఆ నాగరాజు కాస్త వచ్చాడు హొటల్లోకి. నన్ను చూసి "ఏమండోయ్ మిమ్మల్ని కలుసుకుందా మనుకుంటుంటే అట్లాగే పోతోంది. ఆనాడు మూడున్నర యిచ్చి పరువు నిల బెట్టారు. ఇదిగో తీసుకోండి" "త్యాంక్స్" అన్నాడు నాగరాజు.

నా వళ్లు ఝల్లుమంది. మొత్తానికి సమయానికే నువ్వు ఆదుకున్నా వంటూ కౌంటర్ దగ్గరకు వెళ్ళా మీ బాకీ తీర్చాలెండి అంటూ.

'అబ్బే మీ దగ్గర డబ్బెక్కడికి పోతుందండి. ఇవ్వాళ కాకపోతే రేపొ స్తుంది. పాపం మీపర్సు పోయింది" అన్నాడు యజమాని బిల్లు మడుస్తూ.

నా బాకీ తీర్చానని నాగరాజు వుద్దేశం. హొటలు బాకీ తీర్చాడుగదా అని మా స్నేహితుల వుద్దేశం. ఇంతకీ తీర్చిన బాకీ యేది?